
# కుసుమ జయభేరి

తెలుగు సాహిత్య సేవా సాంస్కృతిక e-మాసపత్రిక





సంపుటి-11 సంచిక-1 సెప్టెంబర్-2025 ఎడిటర్ - డాక్టర్ రాధా కుసుమ



Ph: +91 99892 41319 | Email: kusumajayabheri@gmail.com



www.kusumajayabheri.org

# కథలు

## ఆదర్శ అభిరాముడు

రచన: అయ్యలసోమయాజుల ప్రసాద్
విశాఖపట్నం.

అనంతపురంలో వైద్యునిగా పనిచేస్తున్న ప్రకాశరావు గారిని అందరు "ప్రజా డాక్టర్" అని పిలుస్తారు. మధ్యతరగతి కుటుంబానికి చెందిన వారైనా, డాక్టర్ పట్టా పుచ్చుకున్నప్పుడు చేసిన ప్రతిజ్ఞను మనసా, వాచా, కర్మణా పాటిస్తూ, నేటికీ పది రూపాయల ఫీజుతో స్వంతంగా తల్లి పేరుమీద యశోదా హాస్పిటల్ నడుపుతున్న మహనీయుడు.

సుశీలమ్మ గారు వారి ధర్మపత్ని. భర్తకు అన్ని విషయాలలోను సహకరిస్తు, పేరుకు తగ్గట్టు నడచుకునే వారు. వీరి వివాహమై పుష్కరకాలం దాటినా పిల్లలు లేక పోవడంచే తాము నమ్మిన దైవం శ్రీరామచంద్రుని కల్యాణం చేసిన వెంటనే జన్మించిన పుత్రునికి అభిరామ్ అని పేరు పెట్టారు.

ప్రకాశరావు గారి తల్లి యశోదమ్మ డెబ్బై ఏళ్ళు దాటినా తానే ఇంటి పని చేస్తూ, కోడలిని కన్న కూతురుగా చూసుకునేది.

సుశీలా!ఆనాడే చెప్పాను, శ్రీరాముడే మన ఇంట జన్మిస్తాడ"ని,చూశావా కల్యాణం చేసిన ఏడాదికే మగ పిల్లాడు పుట్టాడు అన్న అత్త గారికి నమస్కరించి "పెద్దలమాట చద్దిమూట" అని అందుకే అన్నారు. అంది. వెర్రిదాన! దేముని నమ్మిన వాడు ఎన్నడు చెడిపోడు. అని, ఆప్యాయంగా తల్లిలా దగ్గరకు తీసుకున్నారు.

నానమ్మ పెంపకంలో, అమ్మ, నాన్నల అనురాగ, ఆప్యాయతల మధ్య, అభిరామ్ పేరుకు తగ్గట్టు వినయ విధేయతలతో పెరిగి పెద్దవాడయ్యాడు.

నానమ్మ బాల్యంలో చెప్పిన సుమతీ, వేమన శతకాలు, రామాయణ, భారత గాథలతో బాటు, మీ నాన్నకి డాక్టర్ సీట్ వచ్చినప్పుడే గుండెపోటుతో మీ తాతయ్య చనిపోతే, చదువు మానొద్దు " అని,తాను పడిన కష్టంతో డాక్టర్ కోర్సులో పూర్తి చేశాడు.బంగారు పతకం వచ్చి ప్రభుత్వ ఉద్యోగం వచ్చినా వెళ్లకుండా, పేద ప్రజల సేవకు, జన్మనిచ్చిన నా కొరకు ఉండి పోయాడు అని చెప్పినది. ఆ మాట అభిరామ్ మనసులో బలంగా నాటుకుంది.

అభిరామ్ కూడా ఎం. సెట్. లో మంచి ర్యాంక్ తో పాసయి తిరుపతి లో పెడియాట్రిషియన్(పిల్లల డాక్టర్) లో ఉత్తీర్ణత సాధించాడు. మంచి అవకాశాలు వచ్చినా, అనంతపూర్ లోనే ఉండిపోయాడు. తల్లి తండ్రులు ,నానమ్మ వల్లే ఇంత వాడినయ్యానని చెప్పి, తల్లిదండ్రులు చూసిన డాక్టర్ జానకితో తన అభిప్రాయం చెప్పి, వివాహం చేసుకున్నాడు.

పిల్లలు పరమాత్మ స్వరూపులు. వారి సేవ చేస్తున్న అభిరామ్" నీవు నిజంగా కర్తవ్యమే దైవమని పనిచేసిన ఆనాటి జగదభిరాముడవే" అన్న నానమ్మతో, మరి మా ఆవిడో? అన్నాడు నవ్వుతూ. పేరుకు తగ్గట్టే సాధ్వి సీతమ్మ 'అని ,ఇద్దరిని ఆశీర్వదించింది నానమ్మ. శ్రీరామనవమి కల్యాణం మనవడు,భార్యచే చేయించి తొంభై ఏళ్ళు దాటిన వయస్సులో నవమి తరువాత వచ్చే ఏకాదశి నాడు కొడుకు, కోడలు చేతిమీద మనుమడు డాక్టర్ అభిరామ్ చెంతనుండగా శ్రీరామచంద్రుని దరి చేరింది. ప్రజలంతా యశోదమ్మ అదృష్టవంతురాలు. అంటే నిజమే "జాతస్యహి ధ్రువో మృత్యుః" తొమ్మిది పదుల వయస్సుదాటే వరకూ జీవించిన నానమ్మ అదృష్టంతురాలే అని మనసులో అనుకున్నాడు, మనుమడు డాక్టర్ అభిరామ్.





# ఫోటోలే కదా పెళ్ళి అంటే?

రచన: షామీర్ జానకీదేవి
హైదరాబాద్



అప్పుడే ఆఫీసు నుండి వచ్చిన ప్రతిమ, సుధాకర్ ఆ రోజు తాము వెళ్ళవలసిన వివాహ కార్యక్రమాన్ని గుర్తుచేసుకున్నారు.

ప్రతిమ, సుధాకర్ ఇద్దరూ ప్రభుత్వ కాలేజీలో లెక్చరర్సుగా పని చేస్తున్నారు. వారికి ఇద్దరు కొడుకులు రాకేష్, ఉమేష్. రాకేష్ ఐ ఐ టి ముంబైలో చదువుకుని తరువాత అమెరికా లో ఎమ్ ఎస్ చేసాడు. తరువాత న్యూజిలాండ్ లో మంచి కంపెనీలో ఉద్యోగం తెచ్చుకున్నాడు. వివాహం అయిన తరువాత ఇద్దరూ న్యూజిలాండ్ వెళ్ళిపోయారు.

ఉమేష్ హైదరాబాద్ లోనే ఇంజనీరింగ్ చదివి అమెరికా లో ఎమ్ ఎస్ చేసాడు. సింగపూర్ లో ఉద్యోగం ఆ తరువాత వివాహం ప్రస్తుతం సింగపూరులో సెటిల్ అయ్యారు.

వారికి నచ్చిన అమ్మాయిలను, తల్లిదండ్రుల ఆశీర్వాదంతో పెళ్ళి చేసుకున్నారు. పెద్దవాడు రాకేష్ కి ఒక కొడుకు పేరు విహాన్. మనవడి కోసమని, ప్రతిమ సుధాకర్ న్యూజిలాండ్ వెళ్ళి, ఒక మూడు నెలలు ఉండి వచ్చారు. ఆ తరువాత రాకేష్ అత్తమామలు వెళ్ళారు. ఇంకా ఒక సంవత్సరం సర్వీసు ఉన్నది ప్రతిమ, సుధాకరులకు.

చిన్నవాడికి ఈ మధ్యనే పెళ్ళి చేసారు. మన వివాహ వ్యవస్థలోని గొప్పతనం వివరిస్తూ, అందరూ గొప్పగా చెప్పుకునేలా పెళ్లి చేసారు. అందుకే ఏదైనా పెళ్ళికి వెళితే, సుధాకర్, వాళ్ళను వివరాలు అడుగుతూ ఉంటాడు. అది ప్రతిమకు నచ్చదు.

ఇద్దరూ చక్కగా తయారయి, అదేదో సినిమాలో అక్కినేని, శారదలా బయలుదేరారు. చిలకాకుపచ్చ రంగు పట్టుచీరకు వంకాయకలర్ బార్డర్. లైట్ వెయిట్ తో చాలా బాగుంటుంది. సుధాకర్ ఎంతో ఇష్టపడి కొన్నాడు. చిన్న పోనీ టెయిల్ ఈ మధ్య కొప్పులాగా వస్తోంది. అది ఎవరో కొలీగ్ పెట్టుకుంటే చూసింది. వెంటనే ఆన్లైన్ లో తెప్పించుకుంది. అందులో పోనీ టైల్ దూర్చి స్టైల్ గా కొప్పు అనిపించేలా ఉంటుంది.

“ఏంటోయ్! నీ కొప్పు భలే ముద్దుగా ఉంది” అంటూ దగ్గరికి తీసుకున్నాడు “మీరు

మరీ చిన్న పిల్లలవుతున్నారు" అంటూ ముద్దుగా విసుక్కుంది.

"ఇప్పుడు కూడా ఆంక్షలేనా? సరే పద" ఎక్కడికి పోతావు చిన్నదానా? అని హమ్ చేసుకుంటూ కార్ కీస్ తీసుకున్నాడు.

పెళ్ళికి వెళ్ళేసరికి ఇంకా ఎవరూ రానట్లుగా అనిపించింది. అందరూ చివర్లో వచ్చి అక్షింతలు వేసి తినేసి వెళ్ళిపోతూవుంటారు. అదీ ప్రస్తుతం కొనసాగుతున్న కల్చర్ప

తిమ, సుధాకరులు ముందు వరుసలో కూర్చొని, పెళ్ళిలో జరిగే ప్రతి అంశం చూడాలని అనుకుంటారు. అందుకని మండపం ఎదురుగా సోఫాలో కూర్చున్నారు. కాసేపట్లో వచ్చారు వీడియో గ్రాఫర్లు. సెల్ ఫోన్లతో ఫోటోలు తీసే వాళ్ళు. వీరి కుర్చీల పక్కనే పెద్ద స్క్రీన్ పెట్టారు. అందులో కూడా సరిగ్గా కనిపించడంలేదు.

పెళ్ళికూతురు ఎప్పుడు వచ్చిందో తెలియదు. జీలకర్ర బెల్లం పెట్టేసారు. అది పెడుతూ ఫోటోలు. అందరూ క్యూలో అక్షింతలు వెయ్యటానికి లేచారు. అదేంటి పెళ్ళి అయిపోయిందా? పురోహితుల మంత్రాలు వినే వారు లేరు. ఎంతసేపూ "శ్రీకారం చుట్టుకుంది పెళ్ళి పుస్తకం" ఇదేనా పెళ్ళి అంటే? ఈమధ్య సెల్ ఫోన్ల బెడద కూడా ఎక్కువ అయింది. అందరూ ఫోటోలు తీసే వారే. ఏదైనా సభలకు వెళ్ళినా ఇదే సమస్య. ఒక ఫోటో గ్రాఫర్ అనేకమంది సెల్ ఫోన్లతో ఫోటోలు. ఎవరికైనా స్టేజీ మీద శాలువా కప్పుతుంటే ఫోటో గ్రాఫర్ కి ముందే చెప్పుకుని రెడీగా ఉండమని చెప్పాలి. కొన్ని ఇబ్బందికరంగా ఉంటాయి.

సుధాకర్ కు బ్లడ్ బాయిల్ అవుతోంది. కానీ పెళ్లి పెద్ద క్లోజ్ ఫ్రెండ్, ఏమీ మాట్లాడలేక పోతున్నాడు. "మనం అక్షింతలు తరువాత వేద్దాం కూర్చో" అంటూ ప్రతిమ చెయ్యి పట్టుకుని ఆపాడు.

"మీరూ రండి సార్" అంటూ పక్కనే ఉన్న కొలీగ్ పిలిచాడు.

"మేము తరువాత వస్తాము" అంటూ నవ్వుతూ చెప్పాడు.

ఎంత మంది వచ్చారో అంతమందితో ఫోటోలు. ఇదంతా ఒక రెండు గంటలు నడిచేలా ఉంది. మన వివాహ వ్యవస్థలోని పవిత్రత ఇలా ఫోటోలకు మాత్రమే పరిమితమవుతోంది.వేదమంత్రాల ప్రాధాన్యత తగ్గుతుందేమో అనే భావన కలుగుతోంది. అందుకేనేమో నేటి పెళ్ళిళ్ళు చాలా వరకు విఫలమవుతున్నాయి. సుధాకర్ మనసు మూగగా రోదిస్తోంది.



చాలా ముందుకు వెళ్ళిపోయాం. మళ్ళీ మూలాలు వెతుక్కోవాలి తప్పదు. అనుకుంటూ స్క్రీన్ లో కనిపించే పెళ్ళి తంతు తొంగి చూడసాగారు.

# రోజులు మారాయి

రచన: విత్తనాల విజయ్ కుమార్

“నాన్నా నాకు ఇప్పుడు అప్పుడే పెళ్లి వద్దు.” బీటెక్ చదువుతున్నప్పుడే క్యాంపస్ సెలక్షన్ లో ఉద్యోగం పొంది, చదువు పూర్తయ్యాక ఉద్యోగం చేస్తున్న నా కూతురు సజ్జన అలా అన్నది. నిజానికి నా భార్య రత్నం ‘అమ్మాయికి 21 ఏళ్లు దాటేసాయి కదా! పెళ్లి చేయరా!’ అంటూ చేసే రోజువారీ వేధింపు కారణంగానే అడిగాను.

అమ్మాయి చెప్పిన మాట రత్నం కూడా విన్నది. “మా రోజుల్లో నాకు 16 ఏళ్ళు రాగానే మీ నాన్నకు నా వయసు 18 అని అబద్ధం చెప్పి మా వాళ్ళు కట్టేశారు. నీకు 21 దాటాయి కదమ్మా. పెళ్లి చెయ్యకపోతే ఎలా! నాన్నగారి మాట కాదనకు. ఇప్పుడు ఆయన సంబంధాలు చూడటం మొదలు పెడితే మంచి సంబంధం కుదరటానికి కనీసం ఓ ఏడాది పడుతుంది.” అన్నది నా కూతురుతో.

“అమ్మా రోజులు మారాయి. మా సీనియర్స్ కి ఇంకా పెళ్లిళ్లు కాలేదు. కనీసం 25 సంవత్సరాలు వచ్చేదాకా ఎవరూ పెళ్లిళ్లు చేసుకోవడం లేదు. నన్ను కొంచెం స్థిరపడనివ్వండి.” అలా అనేసి నా కూతురు తన గదిలోకి వెళ్లిపోయింది.

“అది అలాగే అంటుంది. చిన్నపిల్ల. ఏ వయసులో జరగవలసిన ముచ్చట ఆ వయసులో జరగాలి. మీరు సంబంధాలు చూడండి. నేను అమ్మాయిని ఒప్పిస్తాను.” అని బాధ్యత తీసుకుంది నా భార్య రత్నం.

నా భార్య వేధింపులు పడలేక నా కూతురికి ఇష్టం లేకపోయినా సంబంధాలు చూడటం మొదలుపెట్టాను. ఆ విషయాన్ని గ్రహించిన నా కూతురు - “నాన్నా నేనొక అబ్బాయిని ఇష్టపడ్డాను. మాట కూడా ఇచ్చాను. అయితే మీకు ఇష్టం లేకపోతే ఆ అబ్బాయిని మాత్రమే కాదు! ఎవరినీ పెళ్లి చేసుకోను.” నా భార్య పక్కన లేని సమయంలో అలా నా కూతురు చెప్పగానే ఏం మాట్లాడాలో అర్థం కాక నన్ను నేను సమాధాన పరచుకొని - “ఆ అబ్బాయిని ఒకసారి తీసుకుని వచ్చి నాకు పరిచయం చెయ్యమ్మా.” అని నా కూతురికి చెప్పాను.

ఆ అబ్బాయి పేరు హర్ష. చాలా మంచి అబ్బాయి. వినయంగా ఉన్నాడు. ఉద్యోగం కూడా చేస్తున్నాడు. మా అమ్మాయికి ఇంటర్మీడియట్ నుండి క్లాస్మేటట. నేనెప్పుడూ వాళ్లు చదువుకునే రోజుల్లో గమనించలేదు. అప్పట్లో వాళ్లకు ఆ ఉద్దేశం కూడా లేదని

తెలిసింది. అయితే ఒకే ఒక్క చిక్కు వచ్చి పడింది నాకు. అబ్బాయి వాళ్ళు క్రిష్టియన్ మతానికి చెందినవారు. మేము హిందువులము. అదే విషయాన్ని అబ్బాయికి చెప్పి తరువాత మాట్లాడదామని పంపించేసాను.

ఆ రాత్రి నా భార్యకు చెప్పాను. నా భార్య నాపై విరుచుకుపడింది. పెళ్లి జరగటానికి వీలు లేదంది. ఆ పెళ్లి చేస్తే తాను మేడపై నుండి దూకి చచ్చిపోతానని చెప్పింది.

కూతురు మరొక పెళ్లికి ఒప్పుకోదు. భార్య చనిపోతానంటుంది. ఏ రకంగా సమస్యను పరిష్కరించాలో నాకు అర్థం కాలేదు. తాత్కాలికంగా "నువ్వేమీ బాధపడకు. నీకు ఇష్టం లేని పని నేను చేయను. అలాగే అమ్మాయిని ఏమి బాధ పెట్టకు." అని నా భార్యకు చెప్పాను.

ఆరు నెలలు గడిచాయి. నా కూతురి నిర్ణయంలో మార్పు రాలేదు. అలాగే హర్ష కూడా ఎన్ని రోజులైనా వేచి ఉండటానికి అంగీకరించాడు. ఓ రోజున తిరిగి ఆ అబ్బాయిని ఇంటికి పిలిపించాను. నా భార్య కూడా నా పక్కనే ఉంది.

ముందుగా ఆ అబ్బాయితో - "మీకు ఏ లోటూ లేదు. మంచి అలవాట్లు ఉన్నాయి. నాకు నచ్చారు. అయితే మతం కారణంగా నా భార్యకు ఇష్టం లేదు. నిజానికి మా బంధు వర్గానికి మేము దూరమైపోతాము. నాక్కూడా కష్టమైనా నా కూతురి ఇష్టానికి వ్యతిరేకంగా ఏమీ చేయడం నాకు ఇష్టం ఉండదు. అందుకే ఆలోచిస్తున్నాను. మరి మీ అభిప్రాయం చెప్పండి." అన్నాను.

"అంకుల్ మీకు ఇష్టం లేని పని చేయొద్దు." అన్నాడు. నా కూతురు వైపు చూశాను. "నాన్నా నేను ముందే చెప్పాను. మీకు ఇష్టం లేకపోతే పెళ్లి చేయొద్దు అని చెప్పాను. అయితే మరో పెళ్లి సంబంధం కూడా చూడొద్దు. మేము ఇద్దరం మీరు ఒప్పుకునే వరకు ఎంతకాలమైనా ఎదురుచూస్తాము. మా కోసం మీరు బాధపడవద్దు." అని చెప్పింది.

"పెళ్లి కాకుండా మీరు బయట కనబడితే నలుగురూ నాలుగు రకాలుగా అనుకుంటారు కదా!" అని నా భార్య పిల్లల్ని ప్రశ్నించింది.

"అమ్మా మేము సినిమాలకూ షికార్లకూ తిరగము. ఫోన్లో మాట్లాడుకుంటాం. ఆఫీసులో పనిచేస్తున్నాం. కాబట్టి ఆఫీసులో కలుసుకుంటాం. అప్పుడప్పుడు హర్ష మన ఇంటికి వస్తాడు. అది కూడా నీకు ఇష్టం లేకపోతే రాడు. నేనే వాళ్ళ ఇంటికి వెళతాను. అలా వెళ్లడం కూడా నీకు ఇష్టం లేకపోతే నేనూ వెళ్ళను. రోజులు బాగా మారాయి. అయినా మీరు చెప్పినట్లు వినటానికి నేను ఇష్టపడుతున్నాను. పెళ్లి

మాత్రం చేస్తే ఆ అబ్బాయి తోనే చేయండి. లేదంటే నాకు పెళ్లి వద్దు." అని చాలా అనునయంగా తల్లికి చెప్పింది.

నా భార్య ఏమీ మాట్లాడలేదు. మరొకసారి కలుద్దామని చెప్పి హర్షను పంపించేసాను నేను.

అప్పుడప్పుడు హర్ష ఇంటికి వస్తున్నాడు. మాకు అలవాటు అయ్యాడు. నా భార్య కూడా అయిష్టంగానే నా కోసమూ,నా కూతురు కోసమూ అతనితో పొడిపొడిగా మాట్లాడుతుంది.

ఒక సంవత్సరం పాటు గడిచిపోయింది.

ఆరోజు రాత్రి నా భార్యతో - "రత్నం వాళ్ళ పెళ్లి చేసేద్దాము." అన్నాను. ఒప్పుకోలేదు ఆమె.

మాటిమాటికీ ఆమెను ఒప్పించడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాను. బలవంతంగా వేరే ఎవరికైనా పెళ్లి చేయాలని నాకు సలహా ఇచ్చింది. నాకు ఒళ్ళు మండిపోయింది. అయినా తమాయించుకున్నాను.

ఒక వారం రోజులు గడిచాక నా భార్యకు ఒక అబద్ధం చెప్పాను - "ముత్యాలరావు కూతురికి బలవంతంగా పెళ్లి చేసి అత్తారింటికి పంపించాడు. కూతురు ఉరేసుకుని చచ్చిపోయింది. అతనికి పిచ్చెక్కిపోయింది." బాధపడుతున్నట్లు నటించి చెప్పాను.

"ఎవరండీ ఆ ముత్యాలరావు." నోరెళ్ళబెట్టి అడిగింది రత్నం.

"మా ఆఫీసులో నా ఆధీనంలో పనిచేస్తున్నాడు. చాలా మంచివాడు. పాపం పిచ్చివాడైపోయాడు." అన్నాను మరింత బాధను నటిస్తూ.

నా భార్య కూడా చలించి పోయింది. నన్ను బాధ పడవద్దని ఓదార్చింది.

ఆ రోజు నుండి మా అమ్మాయి పెళ్లి గురించి ఆమె కొన్ని రోజులపాటు నాతో ఏమీ చర్చించలేదు.

ఓ రోజున నేనే నా భార్యతో - "పిల్లలకు మనం ఎన్నాళ్ళు ఇలా పెళ్లి చేయకుండా ఉండాలి! ఏదో ఒక రోజున వాళ్లు రిజిస్టర్ మ్యారేజ్ చేసుకుని వస్తే మనమేమి చేయగలం! ఇద్దరూ సంపాదిస్తున్నారు. ఇద్దరూ మేజర్స్. చట్టపరంగా వాళ్లకు హక్కుంది. వాళ్లను కాదనే హక్కు మనకు లేదు. అయినా నేను ఒక విషయం

చెబుతాను విను. ఎవరో ఏదో అనుకుంటారని నువ్వు ఈ పెళ్లి వద్దంటున్నావు. అంటే నీకు మన కూతురి సుఖం కన్నా ఎవరో అనే మాటలు ఎక్కువైపోయాయా." అన్నాను.

ఇదివరకటిలా కసరుకోలేదు నా భార్య. ఆమె అర్థం చేసుకుంటున్నందుకు సంతోష పడ్డాను.

"రత్నం నా మాట విను. పిల్లలు జీవించినంత కాలం మనం జీవించుము కదా! అందుకే వాళ్ళ జీవితాలకు మనం అడ్డు రాకూడదు." అన్నాను నేను.

రత్నం నా గుండెలపై తల పెట్టుకుని వెక్కి వెక్కి ఏడవడం మొదలుపెట్టింది. నేను ఆమెను గట్టిగా హత్తుకొని ఓదార్చాను.

"మరొక విషయం నీకు చెప్పలేక చెబుతున్నాను విను రత్నం. నా కూతురి మనసులో ఒకరు ఉండగా మరొకరితో పెళ్లి చేయడాన్ని మానసిక ..." నన్ను పూర్తిగా చెప్పనీయకుండా నా నోరు మూసేసింది నా భార్య.



"నాకు ఇష్టమే. పెళ్లి చేసేద్దాం. మారుతున్న రోజులతో మనమూ మారాలని నాకు తెలిసిందండి. మీరందరూ చాలా మంచి వాళ్ళు. నాకు నా కళ్ళు తెరిపించారు. నేను మారేవరకు ఎదురుచూశారు. ఈ రోజుల్లో ఎవరూ ఇలా ఉండరు. ఇంకా అంతా మీ ఇష్టమే." అని నన్ను రెండు చేతులతో చుట్టేసింది రత్నం లాంటి నా రత్నం.



# ధారా వాహిక - 10 చైతన్య స్రవంతి

సాంఘిక నవల
రచన: డా జి భవానీ కృష్ణ మూర్తి

"అక్కా!అక్కా!......"
ఏంటి చిన్నీ... ఇంత అర్ధరాత్రి వేళ ఫోన్ చేస్తున్నావ్? "
"అక్కా... నన్ను .. నన్ను చంపాలని చూస్తున్నారు... ఇంట్లోనుంచి బయటికి వచ్చేశా ... ఎక్కడికెళ్లాలో....."ఆయాసంతో మాట రావడం లేదు.
"చిన్నీ.. ఏం జరిగింది?"

"అక్కా!.. నాకు భయం వేస్తోంది.."ఏడుస్తోంది సుశీల. చైతన్య లేచి సెల్ అందుకుని, "ఇప్పుడు నువ్వు ఎక్కడున్నావు సుశీలా?"అడిగాడు.
"తెలియడం లేదు బావా, బస్ స్టాండ్ అనుకుంటా."

"ఓ పని చెయ్యమ్మా... లొకేషన్ షేర్ చెయ్యి.నేను ఇక్కడినుంచి కేబ్ బుక్ చేస్తాను. నీకేమి భయం లేదు, ధైర్యం గా ఉండు " లొకేషన్ ఎలా షేర్ చెయ్యాలో చెప్పాడు. అలాగే చేసింది.

"గుడ్.."కేబ్ బుక్ చేసి," ఐదు నిముషాల్లో కేబ్ వస్తుంది. ఎక్కి ఇక్కడికి వచ్చేయ్. డబ్బులు ఇక్కడికి వచ్చాక నేనిస్తాను. ధైర్యంగా ఉండు. నేను ట్రాక్ చెక్ చేస్తుంటాను.... "చెప్పి, వీడియో కాల్ ఆన్ చేసి, కేబ్ వచ్చి నప్పుడు ఒ టి పి చెప్పి,"డ్రైవర్ తో "చెల్లెమ్మని జాగ్రత్త గా తీసుకురా "అని చెప్పాడు.
అతను సరే నన్నాక "నువ్వు పడుకో బుజ్జీ,నేను చూస్తుంటాను లే. మళ్ళీ చంటిగాడు లేస్తే నిన్ను ఎలానూ పడుకోనివ్వడు "అన్నాడు.

స్రవంతి "ఇంకేం నిద్ర? ఇది అర్ధరాత్రి ఇంట్లోనుంచి వచ్చేయడం ఏమిటో? ",అంది, భయంగా అతని పక్కన కూర్చుని, భుజమ్మీద తలానించింది.
"భయపడకు. మన ప్రయత్నం మనం చేస్తున్నాం కదా."ఆమెని దగ్గరకు తీసుకుని తన గుండెలమీద ఆమె తలానించుకుని జోకొడుతున్నట్లు,వెనక్కి దిండుకి అనుకుని పడుకుని కళ్ళు మూసుకున్నాడు.

ఓ రెండు గంటలు గడిచాక డ్రైవర్ నుంచి కాల్.
చైతన్య సెల్ ఆన్ చేసి "ఆ చెప్పండి ఎంత వరకూ వచ్చారు? ఏనీ ప్రాబ్లమ్?" అడిగాడు.
"ఈ అమ్మాయి స్పృహ తప్పింది "అన్నాడు కంగారుగా.
"అవునా?ఇప్పుడు ఎక్కడ దాకా వచ్చారు.? "

“సామర్లకోట పొలిమేరల్లో ఉన్నాం “. అబార్షన్ అయినట్లుంది సార్ బ్లడ్ పోతోంది “చెప్పాడు.

“మై గాడ్!దగ్గరలో ఉన్న ఆసుపత్రికి తీసికెళ్ళి చేర్చు. నేను వెంటనే బయలు దేరుతున్నా. నేను వచ్చే వరకూ ఆగు అక్కడే. నీకు ఇవ్వాల్సిన డబ్బులు వచ్చాక నేనిస్తా. ప్లీజ్!ఒక చెల్లెమ్మని కాపాడిన వాడివి అవుతావు. ఆసుపత్రి పేరు, లొకేషన్ పంపించు “అంటూనే లేచి, గబా గబా బట్టలు మార్చుకున్నాడు.

ఈ లోగా స్రవంతి కాఫీ కలిపి అతనికి ఇచ్చి, “నేను రానా?”
అంది,ఏడుపు ఆపుకుంటూ.
“వద్దు... బాబు జాగ్రత్త.. నేను చూసుకుంటా... నువ్వేమి టెన్షన్ పడకు “అంటూనే కారు తాళాలు తీసుకుని వెళ్లి, స్టార్ట్ చేశాడు.

స్రవంతి వెంటనే డ్రైవర్ కి కాల్ చేసి, “చెల్లెమ్మ కి ఎలా ఉంది? ఆసుపత్రిలో జాయిన్ చేశారా? సార్ బయలు దేరారు. ప్లీజ్, మందులు ఏమైనా కావాలంటే కొనివ్వండి. సార్ వచ్చాక డబ్బులిచ్చేస్తారు “చెప్పింది, అర్థింపుగా.

“అలాగేనమ్మా... ఇదిగో, ఇప్పుడే ఆసుపత్రి దగ్గరకొచ్చామ్ శ్రీరామా నర్సింగ్ హోమ్ “చెప్పాడు.

రాత్రి పూట ట్రాఫిక్ లేకపోవడంతో తొందరగానే చేరుకున్నాడు చైతన్య. సరాసరి డాక్టర్ దగ్గరికి వెళ్లి తనని తాను పరిచయం చేసుకుని పరిస్థితి అడిగి తెలుసుకున్నాడు.

“ఆహారంలో ఏదో విషపదార్థం కలిపారు..ఫుడ్ పాయిజన్.. పోలీస్ కంప్లైంట్ ఇచ్చాం. ఆమెకి ఇంకా స్పృహ రాలేదు...బ్లడ్ చాలా పోయింది. వెంటనే ఎక్కించక పోతే ప్రమాదం అని చెప్తే... డ్రైవర్ ది అదే గ్రూప్ అట. అతను ఇచ్చాడు.. పదండి “అంటూ, ఐసీయూ లో సుశీల ఉన్న బెడ్ దగ్గరికి తీసికెళ్ళాడు.

దాదాపుగా స్రవంతి పోలికల్లోనే ఉన్న అమ్మాయి అచేతనంగా, ముఖం అంతా వాడిపోయి బెడ్ మీద ఉంది.

ఆ రోజు.. మొదటి పరిచయంలో స్రవంతికి కాలు బెణికినప్పుడు కార్లో వాళ్ళ ఇంటి దగ్గర డ్రాప్ చేస్తే,”అక్కా!” అంటూ వచ్చి, స్రవంతిని పట్టుకుని లోపలికి తీసికెళ్ళింది ఈ అమ్మాయే అని గుర్తు పట్టాడు.

“స్పృహ రాగానే పోలీసులకి ఇన్ఫర్మేషన్ ఇస్తే వారు వచ్చి, స్టేట్మెంట్ తీసుకుంటారు “.చెప్పాడు డాక్టర్.

"థాంక్ యూ డాక్టర్. సీరియస్ ఏమి లేదుగా "

"నథింగ్ టూ వర్రీ... మీరూ...'

"ఐ యామ్ చైతన్య...ఈమె నా వైఫ్ కి చెల్లెలు. ఈమె హస్బెండ్ కొంచెం తేడా. వాళ్లే చేసి ఉంటారు. అదంతా పోలీస్ చూసుకుంటారు. ఈమె ని మూవ్ చెయ్యవచ్చునంటే రాజమండ్రి తీసికెడతాను"

"స్పృహ వస్తే గానీ చెప్పలేను. వెయిట్ చెయ్యాల్సిందే."

"ఓకే డాక్టర్,థాంక్యూ సోమచ్ " షేక్ హ్యాండ్ ఇచ్చాడు చైతన్య.

"మీరు థాంక్స్ చెప్పాల్సింది నాకు కాదు, ఆ కేబ్ డ్రైవర్ కి. ఆడపిల్ల ఒంటరిగా కనిపిస్తే చాలు, అల్లరి పెట్టె మగవాళ్ళే ఎక్కువ ఈ రోజుల్లో.

అలాంటిది ఈ అమ్మాయిని జాగ్రత్త గా తీసుకు రావడమే కాక, రక్తం కావాలను కుంటుంటే తాను ఇస్తానని ముందుకొచ్చాడు.లక్కీ గా అతని బ్లడ్ గ్రూప్ మేచ్ అయింది. లేకుంటే ఈ అర్ధరాత్రి బ్లడ్ డోనర్ కోసం తిప్పలు పడాల్సి వచ్చేది."

"ఓహో... దేవుళ్ళా వచ్చారు అంటారు. ఇంత కంటే బెస్ట్ ఎగ్జాంపుల్ ఏమి కావాలి డాక్టర్?..నేను అతన్ని కలుస్తాను ఎక్కడున్నాడు?" అడిగి, వైయిటింగ్ హాల్లో ఉన్న ఆ వ్యక్తి దగ్గరకు వెళ్ళాడు. అక్కడున్న కుర్చీలో కూర్చుని నిద్ర పోతున్నాడతను. బ్లడ్ ఇచ్చినందు వల్ల కాబోలు నీరసంగా ఉన్నాడు, పైగా రాత్రి సమయం లో వైజాగ్ నుంచి డ్రైవ్ చేసుకుంటూ వచ్చాడు. రెస్ట్ అవసరం అని లేపకుండా, కాస్త దూరంగా వచ్చి, స్రవంతికి కాల్ చేసి, జరిగిన విషయం చెప్పి, కులాసాగానే ఉందని, స్పృహ రాగానే కారులో తీసుకొచ్చి డాక్టర్ శైలజ దగ్గర వైద్యం చేయిద్దామని చెప్పాడు. "అమ్మ నాన్న లేచారా? చెప్పావా?పండు లేచాడా?"

"లేచారు చెప్పాను.అలాంటి వాడిని వదలకూడదు కేసు పెట్టి జైలు లో తోయించాలి అన్నారు మావయ్య "

"మనం పెట్టక్కర లేదు, ఆసుపత్రి వాళ్ళే పోలీసులకి పిలిపించారట. స్పృహరాగానే వాళ్ళు వచ్చి స్టేట్మెంట్ తీసుకుంటారట. అది అయితే గానీ పంపమంటున్నారు. హు!ఏ కులమో తెలియని కేబ్ డ్రైవర్ రక్తం ఇచ్చి ప్రాణం కాపాడాడు. లేకుంటే అర్ధరాత్రివేళ రక్తదాతలు దొరక్కపోతే పరిస్థితి చెయ్యి దాటి పోయేది అన్నారు డాక్టర్" చెప్పాడు.

"మీరు ఆ డ్రైవర్ ని కలిసి మాట్లాడారా?"

“ లేదు. రక్తం ఇచ్చినందువల్ల నీరసం, రాత్రంతా డ్రైవ్ చెయ్యడం వల్ల అలసటతో నిద్రపోతున్నాడు. లేపడమెందుకని ఆగాను. లేచాక మాట్లాడతా. “
“ సరే, మీరూ అర్ధరాత్రి బయలుదేరి వెళ్లారు. కాసేపు రెస్ట్ తీసుకుని, అతను లేచాక ఇద్దరూ బ్రేక్ఫాస్ట్ చేయండి “చెప్పింది.

“సరే, మళ్ళీ చేస్తాను “వెళ్లి, ఎదురుగా ఉన్న మరో కుర్చీలో కూర్చున్నాడు చైతన్య. మెల్లగా కునుకు పడుతుంటే సెల్ రింగ్ అయింది. డ్రైవర్. ఆన్ చేసి “హలో “అన్నాడు. “సార్, ఎక్కడున్నారు? నేను...మీ కోసం....” చైతన్య ఎదురుగా రావడంతో ఆగిపోయాడు.

“నేనే... వచ్చి చాలాసేపు అయింది. నువ్వు నిద్ర పోతున్నావని లేపకుండా ఇక్కడే కూర్చున్నాను “షేక్ హ్యాండ్ ఇచ్చాడు చైతన్య. “సారీ సార్”

“సారీ ఎందుకు బ్రదర్... అమ్మాయిని క్షేమంగా తీసుకోచ్చారు, నెత్తురు ఇచ్చి ప్రాణదానం చేశారు. నేనే మీకు కృతజ్ఞతలు చెప్పాలి” అన్నాడు, ఎదురుగా ఉన్న హోటల్ లోకి దారి తీస్తూ.

“అలాగనొద్దు సార్!ఆడబిడ్డ అర్ధరాత్రి ఒంటరిగొచ్చిందంటే ఏదో అయుంటుందని నాకు తెలుసు సార్. మా సెల్లి కట్నం వేధింపులకి తట్టుకోలేక ఇలాగే అర్ధరాత్రి బయటికొచ్చి, బాయిలో దుంకి సచ్చింది సార్. అందుకే... ఆ సమయంలా అక్కడ మా సెల్లి కనిపించింది సార్.”అన్నాడు.” ఆటోలో అంతా రకతమయితే ఎక్కడ సచ్చిపోద్దో అని బయపడ్డానయ్యా.” చెప్పాడు.

“అంతా చెప్పారు డాక్టర్ గారు. నువ్వే రక్తం ఇచ్చావట. లేకుంటే బ్రతికేది కాదని కూడా చెప్పారు”. “ఏదో గ్రూపు అంట సరిపోయింది నా రగతం ఎక్కించోచ్చు అన్నారు. అందుకే ఇచ్చా. సరిపోక పోతే నేనేంసేసేవోణ్ణండే”. అన్నాడు

“అది ఎంత గొప్ప సహాయమో నీకు అర్ధం కావటం లేదు. ఒక ప్రాణం కాపాడావు... అన్నట్లు.. నీ పేరు..? అడిగాడు.

“మోహన్” “మోహన్ కాదు బాబూ మోహన్.. అచ్చంగా బాబూ మోహన్ లా ఉన్నావ్ “అన్నాడు భుజం తడుతూ. “అయ్ బాబోయ్.. మీకెట్టా తెలిసిందండే.... మా డ్రైవర్లందరు అట్టాగే అంటారండే..”అన్నాడు.

“మరి.. నువ్వు అలాగే ఉన్నావుగా సినిమాల్లో ట్రై చెయ్యాల్సింది కదా.. బాబూ మోహన్ ఇప్పుడెలాగూ సినిమాలు చెయ్యడం లేదు.”

“చాల్లేండే మీ ఆస్సికం” మెలికలు తిరుగుతూ నవ్వేశాడు. “చూడు మోహన్.... ఈ

రోజు నువ్వు చేసిన సహాయానికి ఖరీదు కట్టడంలేదు, కట్టలేను కూడా. ఒక ఆడపిల్ల ప్రాణం కాపాడావు. ఆ పుణ్యం ఊరికే పోదు. ఈ ఐదు వేలు ఉంచు . రాజమండ్రి ఎప్పుడు వచ్చినా నన్ను కలు. నా సెల్ నంబర్ నీదగ్గరుంది కదా. ఇదిగో అడ్రస్."తన విజిటింగ్ కార్డు ఇచ్చాడు, డబ్బుతో పాటుగా.

సెల్ రింగ్ అవుతుంటే చూసి "డాక్టర్ గారు కాల్ చేస్తున్నారు, ఆ అమ్మాయికి స్పృహ వచ్చిందేమో. పద "ఇద్దరూ ఐసీయూ దగ్గరికి వచ్చేసరికి పోలీసులు కూడా వచ్చారు."వద్దు .. వద్దు.. నన్ను చంపొద్దు..."" చేతులు, కదల్చడానికి ప్రయత్నిస్తుంటే నర్సు సెలైన్ ఉన్న చేతిని కదలకుండా గట్టిగా పట్టుకుంది. చైతన్య గబుక్కున వెళ్లి, నర్సుని జరగమని తాను చెయ్యి గట్టిగా పట్టుకుని, మరో చేత్తో ఆమె తల నిమురుతూ "చిన్నీ!కూల్ ! నీకేమి భయం లేదు. ప్రశాంతంగా ఉండు "మెల్లగా అయినా, ఆమెకి వినపడేలా చెవి దగ్గర చెప్పాడు.

"మీరూ...." పోలీస్ ఇనస్పెక్టర్ బెడ్ దగ్గరికొస్తూ "అడిగాడు. చైతన్య జేబులోనుంచి తన విజిటింగ్ కార్డు తీసి ఇస్తూ,"ఈమె మా మరదలు. నా వైఫ్ చెల్లెలు. వైజాగ్ లో ఉంటారు. "అంటూ, జరిగిన దంతా చెప్పాడు.

"అర్ధరాత్రి కాల్ చేస్తే నేనే కేబ్ బుక్ చేశాను. ఇతనే కేబ్ లో తీసుకొచ్చాడు "మోహన్ ని చూపించి చెప్పాడు. మోహన్ దగ్గర స్టేట్ మెంట్ తీసుకుని "అవసరం అయినప్పుడు సాక్ష్యం చెప్పడానికి స్టేషన్ కి రావాలి "చెప్పాడు ఇనస్పెక్టర్. "తప్పకుంట వస్తా సార్.. ఇవిగో!ఆటో లో ఆ అమ్మాయి పడి ఉన్నప్పుడు ఫోటో తీసి ఈ సార్ కి అంపాను "అంటూ రక్తం మడుగు మధ్య పడున్న సుశీల ఫోటోలు ఇనస్పక్టర్ కి చూపించాడు.

"ఈమె భర్త పేరు?" "నాకూ తెలియదు సార్" అన్నాడు చైతన్య.

"అదేంటి.. మీరు.... ఆమె.. మీ మరదలు అన్నారుగా" అనుమానం గా చూశాడు. "అవును.మాది ఇంటర్ కాస్ట్ లౌ మేరేజ్...అదినచ్చక పెళ్ళికి మమ్మల్ని పిలవలేదు. ఈ మధ్యనే పెళ్లయినట్లు తెలిసింది."అంటూ జరిగినదంత చెప్పాడు. "సార్!ఇగో ఆమె సెల్లు. ఇందులో తెలవొచ్చు "సుశీల సెల్ ను జేబులో నుంచి తీసిచ్చాడు డ్రైవర్ మోహన్ .

అది స్విచ్ ఆఫ్ అయిపోయి ఉంది.

"ఛార్జింగ్ అయిపోయినట్లుంది" అన్నాడు ఇనస్పెక్టర్.

డాక్టర్ తనరూమ్ లో ఉన్న ఛార్జర్ తెప్పించి పెట్టారు. మెల్లగా మూలుగు వినిపిస్తుంటే చైతన్య "చిన్నీ!చూడు.. కళ్ళు తెరిచి చూడు. మీ బావ చైతన్య ని."తల నిమురుతూ

మెల్లగా పిలిచాడు. మెల్లగా కళ్ళు తెరిచి,చుట్టూ కలయ చూసింది. "నీకేమి భయం లేదు. నీకేం కాలేదు. మెలకువ తెచ్చుకో" అన్నాడు. "ఊ!..."

డాక్టర్ సలహాతో సిస్టర్ వేడిగా కాఫీ తెచ్చి, కొద్దిగా కొద్దిగా తాగించింది. కాసేపటికి తేరుకుంది. చైతన్య సిస్టర్ సహాయంతో పైకి లేపి,దిండుకి అనుకుని కూర్చునేలా చేశాడు.

"చూడు. ఇనస్పెక్టర్ గారు అడిగిన ప్రశ్నలకి,ఉన్నది ఉన్నట్లుగా జవాబులు చెప్పు.. నువ్వు ఎవరికీ భయపడాల్సిన పని లేదు.. సరేనా? "అన్నాడు చైతన్య. "మీరెప్పుడు రమ్మన్నా వత్తానుండే.. నేనూ ఇశాపట్నం ఎల్లాలుండి."అన్నాడు మోహన్.

వెళ్ళమన్నట్లు ఇనస్పెక్టర్ సైగ చేశాడు. అతను వెళ్ళాక ఇనస్పెక్టర్ సైగతో అతనితో వచ్చిన మరో పోలీస్ వీడియో ఆన్ చేశాడు. చైతన్య కూడా తన సెల్ లో వీడియో ఆన్ చేసి పక్కగా నిలబడ్డాడు.

"మీ పేరు?"

"సుశీల "

'"మీ ఆయన పేరు? "

"సుబ్బారావు "

"ఏం పని చేస్తుంటాడు? "

"ఒక ప్రయివేట్ కంపెనీలో ఇంజనీర్ "

"మిమ్మల్ని బాగా చూసుకుంటాడా?" "చూసుకుంటే ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదుగా" నీరసంగా, నిర్లిప్తం గా నవ్వింది.

"అంటే... కాస్త వివరం గా చెప్పండి మేడం "

"మా అక్క వేరే కులం వాడిని చేసుకుందని రెండు మూడు సంబంధాలు తప్పిపోయాయి. ఆ అవకాశం చూసుకుని మాఅత్త గారు మా ఇంటికి వచ్చి నన్ను తన కొడుక్కిచ్చి పెళ్ళి చేయమని బ్రతిమలాడింది. మా మేనత్త భర్త కూడా పిల్లని బాగా చూసుకుంటారని చెప్పడంతో మానాన్న ఐదు లక్షల కట్నం ఇచ్చి పెళ్ళి చేశారు.

ఐదారు నెలలు బాగానే ఉన్నారు. తరువాతి నుంచి కట్నం తక్కువ అని సణగడం మొదలు పెట్టారు అత్తగారు మామగారు.

మా ఆయన  తాగి లేటుగా ఇంటికి రావడం, మంచినీళ్లలో నలక ఉందని, కాఫీలో పంచదార తక్కువయిందని తిట్టడం, అదేమంటే కొట్టడం మొదలు పెట్టారు, రోజూ తాగి రావడం... పక్కలోకి...." ఆగిపోయింది.

"చెప్పమ్మా....ఫరవాలేదు' అన్నాడు చైతన్య. "తాగుడు వాసనకి నాకు వాంతి వచ్చేది. పక్కలోకి రాకుంటే సిగరెట్ తో కాల్చి వాతలు పెట్టేవాడు. మొగుడి కోరిక తీర్చకపోతే ఇంక నువ్వెందుకే, దున్నపోతులా తిని కూర్చోడానికా'? అని, మా అత్త తిట్టి, బలవంతంగా గదిలోకి పంపేది. ఒళ్ళంతా వాతలు పెట్టి, నానా హింస పెట్టేవాడు. నాకు పడకగదిలోకి వెళ్లాలంటే భయం వేసేది."అంటూ మెడ మీద, పొట్ట మీద ఉన్న సిగరెట్ వాతలు, మచ్చలు చూపించింది.

"మరి. మీ నాన్న గారికి చెప్పలేదామ్మా "అడిగాడు ఇనస్పెక్టర్.

"ఫోన్ చేస్తే ఏమి మాట్లాడతానో, వాళ్ళ గురించి ఏమి చెప్పేస్తానో అని ఎవరో ఒకరు పక్కనే ఉండి, కులాసా మాటలవగానే ఫోన్ లాగేసుకుని, నవ్వుతూ వాళ్లే అమ్మ,నాన్న గారితో "మీ అమ్మాయికేమండి. మహారాణి లా చూసుకుంటున్నాడు మావాడు. మీరేమి బెంగ పడకండి "అంటూ ఫోన్ పెట్టేసేవారు.

"వాళ్ళెవరు లేనప్పుడు నాన్నకి చెప్తే, కొన్నాళ్లు ఓపిక పట్టమ్మా. పిల్లలు పుడితే అతనే మారతాడు అని సర్ది చెప్పే వారు. ఈ మధ్య ఆఫీసులో ఒక డబ్బున్నవాళ్ళ అమ్మాయిని వల్లో వేసుకున్నాడు.నేను జాబ్ లో చేరాను.. జీతం రాగానే తీసేసుకునే వాడు. రోజూ బస్ కి నేను ముష్టిదానిలా చిల్లర అడుక్కోవలసి వచ్చేది. పైగా ఎవరితోనైనా నవ్వుతూ మాట్లాడితే అనుమానం. వాడితో నీకేం పని అని, జుట్టు పట్టి కొట్టేవాడు."ఆగింది. నర్సు కి చెప్పి పాలు తెప్పించి తాగించాడు చైతన్య.

"నాకు నెల తప్పింది. మా నాన్న అన్నట్లు పిల్లలు పుడితే మారతాడులే అని ఆశ పడ్డాను. ఆ విషయం తెలిసి సంతోషించకపోగా, తల్లిదండ్రులతో మంత్రాంగం జరిపాడు.

ధనవంతురాలు అయిన ఆ అమ్మాయితో పెళ్ళికి,..నేను, పుట్టబోయే బిడ్డ ఆటంకం అవుతామని నన్ను చంపాలని ప్లాన్ వేశారు. నిన్నరాత్రి నేను తినే అన్నంలో ఏదో మందు కలిపినట్లున్నారు. మా ఆయన, అత్తగారు దగ్గర కూర్చుని 'తిను, తల్లివి కాబోతున్నావ్. ఇలా పిడికెడంత తింటేఎలా? బలం రావద్దూ!బిడ్డ బాగా పెరగద్దూ!' అంటూ బలవంతంగా నాచేత తినిపించి, నేను తిని,చెయ్యి కడుక్కున్నాక విరగబడి నవ్వడం మొదలు పెట్టారు. నాకు అర్థం కాక చూస్తుంటే "కాసేపట్లో ఛస్తావే!మావాడికి మరో డబ్బున్న అమ్మాయితో పెళ్ళి చేస్తాం" అంటూ నవ్వారు. నాకు భయం వేసింది

బాత్ రూమ్ లోకి వెళ్లి నోట్లో వేళ్ళు పెట్టుకుని కక్కేశాను.

తాగి వాళ్ళు నిద్ర పోయాక, మెల్లగా తలుపులు తెరిచి బయట గడియ పెట్టేసి, బస్ స్టాండ్ కి వచ్చి అక్కకి ఫోన్ చేశాను "చెప్పి, నీరసంతో కళ్ళు మూసుకుంది సుశీల. "నువ్వు రెస్ట్ తీసుకోమ్మా. ఇంక వాళ్ళ సంగతి మేము చూస్తాం "చెప్పి వెళ్లిపోయారు. "డాక్టర్! అమ్మాయిని నేను తీసికెళ్ళ వచ్చా, కార్లో ఫరవాలేదా? అంబులెన్సు లో తీసికెళ్ళ మంటారా?" అడిగాడు చైతన్య.

"నో ప్రాబ్లమ్,ఒక గంటే కదా కార్లో తీసుకెళ్లండి. ముందు కాస్త ఇడ్లీ ఏదైనా తెచ్చి తినిపించండి "అన్నాడు. చైతన్య తీసుకొస్తే నర్సు తినిపించింది.

"చిన్నీ!కార్లో కూర్చో గలవా? అంబులెన్సులో వస్తావా?"

"కూర్చుంటాను. మీకు చాలా శ్రమ ఇస్తున్నాను బావా!మీ ఋణం ఎలా తీర్చుకో గలను?". చేతులు జోడించింది కన్నీళ్లతో.

"నువ్వేమి బెంగ పడకు. మీ అక్క దగ్గర్నుంచి వసూలు చేసుకుంటాను లే " నవ్వి "అనవసరం గా ఆలోచించి ఆరోగ్యం పాడు చేసుకోకు "నర్సు సాయంతో వీల్ ఛైర్ లో తీసుకొచ్చి, ఫ్రంట్ సీట్ లో కూర్చోబెట్టి, బెల్ట్ పెట్టాడు.

లోపలికెళ్లి డాక్టరికి కృతజ్ఞతలు చెప్పి, ఫీజు చెల్లిచి, నర్సులకి, వార్డ్ బాయ్ కి చెరో వంద ఇచ్చి,కార్ స్టార్ట్ చేశాడు.

"నన్ను పెళ్ళి చేసుకుందని మీ అక్కని వెలివేసిన మీ నాన్నగారు ఇప్పుడు నాతో మా ఇంటికి వచ్చావని తెలిస్తే నిన్న కూడా వెలివేస్తారేమో? నిన్ను మీ ఇంటికే తీసికెళ్ళనా?"అడిగాడు.

"ఏమో!... మీకు ఏది మంచిదనిపిస్తే అలాచేయండి బావా ......కానీ, వాళ్ళు వచ్చి, కల్లబొల్లిఏడుపులేడిస్తే,మళ్ళీనాన్నగారుకరిగిపోయిఅక్కడికిపంపేస్తారేమో?ఇప్పుడు నా బిడ్డని నాకు దూరం చేసిన ఆ దుర్మార్గులు ఈ సారి నన్ను చంపడం ఖాయం."అంది ఏడుపు గొంతుకతో.

"ఏడవకు ఇప్పుడు నేను ఒక లేడీ డాక్టర్ దగ్గరికి తీసికేడతాను.ఆవిడ మీకు తెలిసినావిడే.. మీ అక్క కి ఫ్రెండ్ అట. డాక్టర్ శైలజ....చెకప్ చేసి మందులు రాసి ఇస్తారు. మనింటికి రా.ఈ రాత్రికి అక్కడ రెస్ట్ తీసుకో.మీ అక్కతో చక్కగా కబుర్లు చెప్పుకో. బాబుతో ఆడుకో.రేపు ఉదయం తీసుకొని వెళ్లి మీ ఇంటి దగ్గర దిగబెడతా. మీ ఆయన, అత్త,మామ ఇవాళో రేపో అరెస్ట్ అవుతారు. అంచేత ఎవరూ వచ్చి

నిన్ను తీసికెళ్లరు. ఒకవేళ వచ్చి, నువ్వు వెళ్లక తప్పదంటే మన ఇంటికి వచ్చేయ్. భయపడకు. ఈ జీవితం నీది. ఎవరికోసమో ఎందుకు బలి చేసుకోవాలి? వరంగా దేవుడిచ్చిన ఈ జీవితాన్ని మధ్యలోనే అంతం చేసుకోవడం పాపం సుశీలా". "మీరు ఇంత మంచివారు .... ఆ రోజు అక్క ఫోన్ చేసి,పెళ్లి చేసుకున్నానని చెప్పగానే నాన్నగారు........."ఆగిపోయింది.

"చెప్పు ఫరవాలేదు. మీ అక్కతో చెప్పనులే "అన్నాడు చైతన్య.

"అమ్మతో 'నీ పెద్ద కూతురు చచ్చిపోయింది. వెళ్లి మైల స్నానం చేసిరా.నువ్వు కూడా వెళ్ళు 'నాక్కూడా చెప్పి, తను బావి దగ్గరకు వెళ్లి నీళ్లు తోడి స్నానం చేసి వచ్చి,'దానితో, ఎప్పుడూ, ఎవరూ మాట్లాడ కూడదు "అనేసి, మంత్రాలు చదువుతూ నువ్వులు, నీళ్లు వదిలిపెట్టి,తన గదిలోకి వెళ్లిపోయారు.

ఆ రాత్రి ఇంట్లో ఎవరూ భోజనం చెయ్యలేదు......... ఆ రోజు మీరేగా... అక్కని కార్లో తీసుకొచ్చి దింపారు " అడిగింది. అవునన్నట్లు నవ్వుతూ తలూపాడు.

మాటల్లోనే కారు డాక్టర్ శైలజ నర్సింగ్ హోమ్ ముందు ఆగింది. వీల్ ఛైర్ లో లోపలికి తీసికెళ్ళాడు. శైలజ సుశీలని పరీక్ష చేసి "నథింగ్ టు వర్రీ."అని, "స్టమక్ వాష్ చేశారు. ఆ విషాహారం ఎఫెక్ట్ ఇంకేమి ఉండదు.గర్భంలోని పిండం విచ్ఛిత్తి కావడం దానివల్లనే. నువ్వు తెలివిగా దాన్ని వెంటనే కక్కేయడం వల్ల నీకు ప్రాణహాని తప్పింది.. అలాంటి వారిని వదిలి పెట్టకూడదు" అంది డాక్టర్ శైలజ. "మన ప్రమేయం లేకుండానే పోలీస్ కంప్లైంట్ కూడా ఇచ్చేశారు. ఇంక వాళ్ళని వదిలి పెట్టరు. గృహహింస చట్టం కింద బుక్కయిపోతారు" "చెప్పాడు చైతన్య. "స్రవంతి తరువాత ఈ అమ్మాయి స్కూల్ లో చేరేనాటికి ఆ స్కూల్ లో నాచదువు అయిపొయింది. కాకినాడ వెళ్ళిపోయాను అందుకే ఈ అమ్మాయితో పరిచయం లేదు "అంది శైలజ.

"అవును.. అప్పుడు.. .. డాక్టరీ చదువుతోందట, కాకినాడలో అని అక్క చెప్పేది " అంది సుశీల.

తీసుకోవలసిన జాగ్రత్తలు, ఆహారం గురించి చెప్పి, "ఇంటికి తీసికెళ్ళవచ్చు "అని చెప్పింది. తిన్నగా కార్లో ఇంటికి తీసుకొచ్చాడు. చెల్లెల్ని చెయ్యి పట్టి లోపలికి తీసికెళ్లి, కౌగలించుకుని "ఎలా ఉండేదానివి, ఇలా పీనుగలా అయిపోయావేంటే?" ఏడ్చేసింది స్రవంతి.

"అమ్మాయ్!తనకి ధైర్యం చెప్పాల్సింది పోయి, నువ్వేంటి ఇలా?, స్రవంతిని మందలించి, సుశీలని గదిలోకి తీసికెళ్లి, బెడ్ మీద పడుకోబెట్టి, "చూడమ్మా,జరిగిన

వాటి గురించి ఆలోచించకు. నీ ఆరోగ్యం చూసుకో. మానసిక బలహీనత అన్నిటికన్నా పెద్ద జబ్బు. నువ్వు దాన్ని జయించాలి "పక్కన కూర్చుని ధైర్యం చెప్పింది జానకమ్మ. తన చేతుల్లో ఉన్న మనవడిని సుశీల చేతుల్లో పెట్టి "వీడితో నీకు చక్కని కాలక్షేపం "అంది.

నిజంగానే సుశీలకి చిన్నారి రఘుని చూడగానే అంత వరకూ ఉన్న ఆందోళన తగ్గి, ముఖంలో నవ్వు చోటు చేసుకుంది.


ఆ రోజు అక్కడ ఉన్నాక, మరునాడు తీసికెళ్లి పుట్టింటి దగ్గర దింపాడు. దారిలో "నీకు అక్కడ బాగులేక పోయినా,, ఎప్పుడు రావాలనిపించినా మీ గోపాలానికి చెప్పు. మీ నాన్నగారు పెద్దవారు చాదస్తంగా ఏదైనా అన్నా పట్టించుకోకు.. నీ సెల్ లో ఫోటోలు, పోలీసులతో వీడియో అన్నీ డిలీట్ చేసేశాను. ఆ చాప్టర్ ముగిసింది. ప్రశాంతంగా ఉండు. మళ్ళీ ఉద్యోగంలో చేరడమో,చదువుకోవడమో చెయ్యి. గుర్తు పెట్టుకో..ఈ జీవితం నీది. నీకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా నేనున్నానని మరిచిపోకు. ఒక్క ఫోన్ చెయ్యి, మెసేజ్ పెట్టు చాలు "అన్నాడు.



అతని చేతులు పట్టుకుని "బావా!మీరే లేకపోతే ఈ జీవితం నిన్ననే ముగిసిపోయేది. మీ ఋణం ఎలా తీర్చుకోను?" అంది కన్నీళ్లతో.

"నా భార్యకి చెల్లెలివైతే నాకూ చెల్లెలితో సమానమే. బుక్స్ పంపిస్తాను. చదువుకో.. ప్రయివేటుగా పరీక్ష రాయచ్చు. ధైర్యంగా ఉండు. ఋణం అంటూ పిచ్చిగా ఆలోచించకు. అని చెప్పాడు.

(సశేషం)







## EDITORIAL BOARD

**Editor-in-Chief:**
Dr. (Mrs.) Radha Kusuma

**Co-Editors**
Dr. Mantri Pragada Markandeyulu, Litt.D.,
Dr. B. Rama Devi, MA, B Ed.,
Dr. Bhavani Krishnamurthy
Shri A Rammurthy Raju

**Advisior**
Dr. Tarapatla Satyaarayanna, Ph.D
Ms. Mamatha Ummadi Singh, MA (Hindi)
Dr Jeldhi Vidhyadhar IRS
Shri Badesab Pinjari
Shri K. Murali Mohan Raju

**Legal Advisor**
Shri Manuvada Bhanoji Rao High Court Advocate, Hyderabad & Amaravathi.



అక్టోబర్ నెల నుండి వాణిజ్య ప్రకటనలు తీసుకోబడును




# కుసుమ జయభేరి

తెలుగు సాహిత్య సేవా సాంస్కృతిక e-మాసపత్రిక

# KUSUMA JAYABHERI E-MAGAZINE

## Monthly Telugu Language.


Ph: +91 99892 41319 | Email: kusumajayabheri@gmail.com
www.kusumajayabheri.org